TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు　　తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్　సంపుటి :01　సంచిక : 193　సోమవారం 17-03-2025　పేజీలు : 06　వేల : 05/-

## ఓటర్ ఐడి కార్డు ఆధార్ తో అనుసంధానం



**న్యూ డిల్లీ మార్చి 16 :** 'ఓటర్ల జాబితా డేటాలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆధార్‌తో వోటర్ గుర్తింపు కార్డులను అనుసంధానం చేసే అంశంపై కేంద్ర హెూమ్ శాఖ కార్యదర్శి, శాసన వ్యవహారాల కార్యదర్శితో సమావేశాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఓటర్లకు డూప్లికేట్ వోటర్ కార్డు సంఖ్యలు కేటాయించిన కేసులను ప్రతిపక్ష తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ప్రస్తావిస్తూ, బిజెపికి సాయం చేయడానికే ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలో అక్రమాలు చేస్తున్నదని ఆరోపించింది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఇటీవల లోక్‌సభలో ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేశారు. డూప్లికేట్ కార్డు నంబర్ల అంశం 'వారసత్వంగా వస్తున్నద'ని ఎన్నికల కమిషన్ (ఇసి) పేర్కొంటూ,రానున్న మూడు నెలల్లో ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. డూప్లికేట్ నంబర్లు తప్పనిసరిగా బోగస్ ఓటర్లకు సూచిక కాదని కూడా ఇసి స్పష్టం చేసింది. సిఇసి కుమార్ మంగళవారం హెూమ్ శాఖ కార్యదర్శి, శాసన వ్యవహారాల విభాగం కార్యదర్శి, యుఐడిఎఐ సిఇఒతో ఈ అంశంపై చర్చిస్తారని అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. ఓటర్ల జాబితాలను ఆధార్ డేటాబేస్‌తో అనుసంధానించేందుకు చట్టం అనుమతిస్తోంది. ఆధార్, ఓటర్ కార్డు అనుసంధానం ప్రక్రియకు ఎటువంటి లక్ష్యాన్నీ లేదా గడువులనూ నిర్దేశించలేదని ప్రభుత్వం పార్లమెంట్‌లో తెలియజేసింది. ఓటర్ల జాబితాలతో తమ ఆధార్ వివరాలను అనుసంధానించని వ్యక్తుల పేర్లను వోటర్ల జాబితాల్లో నుంచి తొలగించబోరని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది.

## దేశంలో కుల గణన చేపట్టాలి

### - బిఎస్‌పి అధినేత్రి మాయావతి



**లక్నో మార్చి 16 :** దేశంలో కుల గణన చేపట్టాలని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈ దశగా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాన్షీరామ్ జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసిన మాయావతి కులగణన చేయాలని పునరుద్ఘాటించారు. సమగ్ర అభివృద్ధి కోసం జనగణన అవసరమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిని విస్మరించకూడదని ఆమె సూచించారు. కులగణన చేయకుంటే అది సుపరిపాలన కాబోదని ఆమె అన్నారు. కులగణన చేయకపోవడంపై ఒక పార్లమెంటరీ కమిటీ కూడా అసంతృప్తి వ్యక్తం చేసిందని మాయావతి గుర్తు చేశారు. ఉత్తర ప్రదేశ్‌లో 80 శాతం మంది బహుజనులు ఉన్నారని, ఇటువంటి చోట్ల కులగణన చాలా ముఖ్యమని ఆమె అన్నారు. మాయావతి మరొక ట్వీట్‌లో తనను ఒక ఉక్కు మహిళగా పేర్కొన్నారు. ఉక్కు మహిళ నాయకత్వంలోని బిఎస్‌పి మాటల కంటె చేతలకు ఎంత విలువ ఇస్తుందో ఉత్తర ప్రదేశ్ ప్రజలకు తెలుసునని మాయావతి పేర్కొన్నారు.

## పద్మ అవార్డులకు నామినేషన్లు..జూలై 31 వరకు గడువు




**న్యూ డిల్లీ మార్చి 16:** అసాధారణ విజయాలు సాధించిన, సేవలు అందించిన విశిష్ట వ్యక్తులకు ప్రదానం చేసే 2026 పద్మ పురస్కారాల కోసం నామినేషన్లు, సిఫార్సుల ప్రక్రియ శనివారం మొదలైంది. 2026 రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డుల కోసం నామినేషన్లకు, సిఫార్సులకు చివరి తేదీ జూలై 31 అని అధికార ప్రకటన తెలియజేసింది. పద్మ అవార్డుల నిమిత్తం నామినేషన్లు, సిఫార్సులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (అవార్డ్.గవ్.ఇన్)పై ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు దేశంలో అత్యున్నత పౌర పురస్కారాలు. 1954లో ప్రవేశపెట్టిన ఈ అవార్డులను ప్రతి సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తుంటారు. 'విశిష్ట కృషి'కి గుర్తింపుగా ఈ అవార్డులు ఇస్తుంటారు. ఆ కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్,ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమ వంటి అన్ని రంగాలు, విభాగాల్లో విశిష్ట, అసాధారణ విజయాలు సాధించిన, సేవలు అందించిన వారికి ఈ అవార్డులు ప్రదానం చేస్తుంటారు. జాతి, వృత్తి. పదవి, లింగభేదం లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులని ఆ ప్రకటన తెలిపింది. అయితే, వైద్యులు, శాస్త్రవేత్తలు కాకుండా, పిఎస్‌యులలో పని చేస్తుండే వారితో సహా ప్రభుత్వోద్యోగులు పద్మ అవార్డులకు అర్హులు కారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పద్మ పురస్కారాల ప్రదానం ద్వారా 'సాధారణ హీరోలను' సత్కరించనారంభించినట్లు, తద్వారా పద్మ అవార్డులను 'ప్రజల అవార్డులు'గా మార్చినట్లు అధికారులు తెలియజేశారు. అందువల్ల స్వీయ నామినేషన్‌తో సహా నామినేషన్లు, సిఫార్సులు చేయవలసిందిగా పౌరులు అందరికీ వారు విజ్ఞప్తి చేశారు.

## ఎస్.ఎల్.బి.సీ. టన్నెల్ సహాయక చర్యల పురోగతిపై బృందాల వారీగా సమీక్ష



డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శనివారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, అవసరమైన మార్పులను అమలు చేస్తున్నట్లు, సహాయక బృందాల ఉన్నతాధికారులు ప్రతిరోజు టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశాన్ని చేరుకొని సహాయక బృందాలకు చేయవలసిన పనిపై మార్గనిర్దేశం చేస్తూ, సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు వేగంగా జరిగేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. అన్వి సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా, 30 హెచ్.పీ.సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంక్ ఉపయోగించి నీటితో కూడిన బురద మరియు మట్టిని తొలగించనున్నట్లు, తెలిపారు.టన్నెల్‌లో 24 గంటలు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని, గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నట్లు వివరించారు. టన్నెల్‌లోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, ఆధునిక పరికరాలు మరియు రోబోట్లను ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు, సహాయక బృందాలు, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, అవసరమైన మార్పులను అమలు చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయడం కోసం భద్రతా నిపుణుల పర్యవేక్షణలో పనులు కొనసాగిస్తు, సహాయక చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా, ఆక్సిజన్ సరఫరా, వైద్య సేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టన్నెల్ లోపల పని చేసే బృందాల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుని, అత్యవసర అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం లిక్విడ్ రింగ్ వ్యాక్యూమ్ పంప్, పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు పరీక్షత్ మేహర, సింగరేణి మైండ్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు నిరంజన్, డాక్టర్ హరీష్, జిఎస్ఐ అధికారులు తప్లియాల్, హైడ్రాధికారులు కడవర్ డ్రాగ్స్ స్క్వాడ్, ర్యాట్ హెూల్ మైనర్స్, ఎస్ డి ఆర్ ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే అధికారులు అన్వి రోబోటిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు పరీక్షత్ మేహర, సింగరేణి మైండ్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు నిరంజన్, డాక్టర్ హరీష్, జిఎస్ఐ అధికారులు తప్లియాల్, హైడ్రాధికారులు కడవర్ డ్రాగ్స్ స్క్వాడ్, ర్యాట్ హెూల్ మైనర్స్, ఎస్ డి ఆర్ ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే

### - బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ గారి మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయోగించిన భాషను తెలంగాణ సమాజమంతా వ్యతిరేకిస్తున్నది కాబట్టి తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ హుందాగా రాజకీయాలు చేస్తుందని, ముఖ్యమంత్రి ప్రయోగించిన భాషను తాము ప్రయోగించలేమని, కాబట్టి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. శనివారం శాసనమండలి ఆవరణలో ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ... ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారని, ఆ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే బట్టలు ఊడదీసి ఊరేగిస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తెలంగాణ చరిత్రలో ఇది చీకటి రోజని స్పష్టం చేశారు. మహిళలను రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తూనే, తన ఇంట్లోని మహిళలను తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూనే, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తానని అంటూనే ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయనకు తగదు అని సూచించారు. గతంలో కేసీఆర్ గారితో పాటు తమ కుటుంబంలోని చంటి పిల్లలను కూడా వదిలిపెట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు అవి తిరిగి ముఖ్యమంత్రికే వస్తున్నాయని చెప్పారు. "మనం కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవాళ్లం. ఇవాళ ఏం చేస్తామో మళ్ళీ అది మనకు వాపస్ వస్తుంది. గత ఐదు ఆరు సంవత్సరాల లో వాళ్లు చేసిన పనే తిరిగి వాళ్లకు చుట్టుకుంటున్నది. అది ఎవరు చేయిస్తున్నది కాదు. "అని వ్యాఖ్యానించారు. మంత్రులు కూడా చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారని, సభలో ఉంటే ఉండండి లేదంటే వెళ్లిపోండి అని చాలా దురుసుగా దురాహంకారంతోటి బిఆర్ఎస్ ఎమ్మెల్సీలను ఉద్దేశించి మాట్లాడారని విమర్శించారు. ఇటువంటి అహంకార పూరితమైన వ్యాఖ్యలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నదని మండిపడ్డారు.


# ఇష్టానుసారంగా పోస్టులు పెడితే తోడ్కలు తీస్తా..

## నోటికొచ్చింది మాట్లాడితే కుదరదు... - సోషల్ మీడియాపై సీఎం రేవంత్ ఫైర్



గత కొన్ని రోజులుగా 'భూ భారతి' పేరుతో తనపై సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెట్టిన అంశంపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. భూభారతిని తీసుకొచ్చి పేదల భూములను పేదలకు ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నందుకు తనపై కోపం పెంచుకుంటున్నారా? అని ధ్వజమెత్తారు. అసలు తనపై అక్కసు వెళ్లగక్కాల్సిన అవసరం ఏమొచ్చిందని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించారు. "పెయిడ్ ఆర్టిస్టులను తీసుకొచ్చి పార్టీ ఆఫీసులో పెడుతున్నారు. వాళ్లు రికార్డు చేసి సోషల్ మీడియాలో పెడితే పోలీసులు కేసు పెట్టారు. వారు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన భాషను ఒకసారి చూడండి. అసలు జర్నలిస్టు అంటే ఎవరు?అని ఈ సందర్భంగా నేను అడగాలనుకుంటున్నా. ఎవరు పడితే వాళ్లు ఒక ట్యూబ్ (ఛానెల్) పట్టుకొని ఇష్టారాజ్యంగా మాట్లాడితే వాళ్లు జర్నలిస్టులు అవుతారా? వాళ్లు వాడే భాష చూస్తే రక్తం మరిగిపోతోంది. ప్రజా జీవితంలో ఉన్నాం కాబట్టి ఓపిక పడుతున్నాం. కుటుంబసభ్యులను అంతేసి మాటలు అంటుంటే.. అసలు మీరు మనుషులేనా? మీకు భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు లేరా? మీ అమ్మనో.. చెల్లినో.. భార్యనో.. ఈ రకంగా మాట్లాడితే నువ్వు వింటావా?" "నా భార్యను, బిడ్డను తిడితే నాకు నొప్పి అవుతుంది. ఒక ఆడపిల్లను అవమానిస్తుంటే మీకు నొప్పి రాదా? ఏ సంస్కృతిలో ఉన్నామని నేను అడుతున్నా. ముఖ్యమంత్రిగా చెబుతున్నా.. ఒక్కొక్కరి తోడ్కలు తీస్తా. ప్రజా జీవితంలో ఉన్న మా గురించి మాట్లాడండి.. విమర్శించండి. అంతేకానీ ఇంట్లో ఉన్న ఆడవాళ్లపై మాట్లాడే సంస్కృతి ఎక్కడి నుంచి వచ్చింది. నోటికొచ్చింది మాట్లాడి.. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయించడం ఏ పైశాచిక ఆనందం. వాళ్లు తిట్టిన తిట్ల చోట నా పేరు తీసేసి మీ పేరు రాసుకొని వినండి. అవి విన్నాక అన్నం తినబుద్ధి అవుతుందేమో చూడండి" అని సీఎం అసహనం వ్యక్తం చేశారు.

## కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ ప్రమాణం



కెనడా నూతన ప్రధానిగా మాజీ సెంట్రల్ బ్యాంకర్ మార్క్ కార్నీ(59) శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. మార్క్ కార్నీ ఇకపై ప్రధాని జస్టిన్ ట్రూడో స్థానాన్ని భర్తీ చేయనున్నారు. కొన్ని రోజుల్లో లేక వారాల్లో ఆయన సార్వత్రిక ఎన్నికలు చేపట్టనున్నారు. కెనడాను 51వ రాష్ట్రంగా అమెరికాలో కలుపుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇదివరకే హెచ్చరికలు చేశారు. పైగా కెనడా మీద వాణిజ్య యుద్ధాన్ని కూడా మొదలెట్టారు. ఈ నేపథ్యంలో కెనడాకు మార్క్ కార్నీ సారథ్యం వహించబోతున్నారు. 'కెనడా సార్వభౌమాధికారానికి గౌరవం ఇచ్చేట్లయితేనే నేను ట్రంప్‌తో సమావేశం అవుతాను' అని కార్నీ స్పష్టం చేశారు. అమెరికా ఇప్పటికే కెనడా స్టీల్, అల్యూమినియంపై 25 శాతం సుంకాలు విధించింది. కార్నీ 2008లో 'బ్యాంక్ ఆఫ్ కెనడా'ను సంక్షోభం నుంచి గట్టెక్కించారు. ఆ తర్వాత 2013లో నాన్‌సిటిజెన్‌గా 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్'కు హెడ్‌గా పనిచేశారు. అప్పట్లో ఇంగ్లాండ్‌ను 'బ్రెక్సిట్' సంక్షోభం నుంచి గట్టెక్కించారు. ఇదిలావుండగా కెనడా మాజీ ప్రధాని జీన్ క్రిస్టీన్ 'కార్నీ బాగా పనిచేస్తారు. ఆయనకి అంతర్జాతీయంగా మంచి గౌరవం ఉంది. ఇప్పుడున్నది సాధారణ వాతావరణమేమి కాదు. ఈ నేపథ్యంలో ఎలాంటి మ్యాజిక్ పరిష్కారమూ లేదు. ప్రతి ఐదు నిమిషాలకు ఆలోచన మార్చుకునే అమెరికా అధ్యక్షుడి వంటి వారిని మేము ఎన్నడూ చూడలేదు. ట్రంప్ కెనడాకే కాక ప్రతిచోట సమస్యలు సృష్టిస్తున్నాడు' అన్నారు.

## ఐఎస్ఎస్ చీఫ్‌ను హతమార్చిన అమెరికా దళాలు

**బాగ్దాద్ :** ఐఎస్ఐఎస్ చీఫ్ అబ్దుల్లా మక్కి మస్లిహ్ అల్ – రిఫాయి (అబూ ఖదీజా)ని అమెరికా, ఇరాకీ దళాలు సంయుక్తంగా వైమానిక దాడి జరిపి హతమార్చాయి. మార్చి 13వ తేదీన ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో అబూ ఖదీజా మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ విషయాన్ని ఇరాక్ ప్రధానమంత్రి మహమ్మద్ షియా అల్ – సుడానీ శుక్రవారం ప్రకటించారు. ఇరాక్‌లోనే కాదు.. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదులలో అబు ఖదీజా ఒకరు. ఆయనను హతమార్చినట్లు ఇరాక్ ప్రధాని తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.కాగా, ఇరాక్ ఇంటెలిజెన్స్ వర్గాలు, భద్రతా దళాలు.. యుఎస్ కంట్రోల్ కమాండ్ (సిఇఎన్‌టిసిఓఎం)లు సంయుక్తంగా ఇరాక్‌లోని అల్ అన్బార్ ప్రావిన్స్‌లో మార్చి 13వ తేదీన వైమానిక దాడి జరిపాయి. ఈ దాడి జరిపిన సమయంలో.. అబు ఖదీజా ఆయుధాలతో ఆత్మాహుతికి ప్రయత్నించినట్లు సిఇన్‌టిసిఓఎం గుర్తించాయి. ఈ దాడిలో చనిపోయిన వ్యక్తి డిఎన్ఎ అబు ఖదీజాదేనని అమెరికా దళాలు నిర్ధారించాయి.ఐఎస్ఐఎస్ చీఫ్ మృతిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. 'మన ధైర్యవంతులు, యుద్ధయోధులు అవిశ్రాంతంగా వేటాడి ఐఎస్ఐఎస్ నాయకుడిని హతమార్చారు. ఇరాక్ ప్రభుత్వం, కుర్దీస్ ప్రాంతీయ ప్రభుత్వ సమన్వయంతో ఇది జరిగింది' అని ట్రంప్ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. బలం ద్వారానే శాంతి చేకూరుతుందని ఆయన పోస్టులో సందేశమిచ్చారు.

## యూఎస్‌లో దక్షిణాఫ్రికా రాయబారిపై ట్రంప్ బహిష్కరణ వేటు



**అమెరికా :** దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపుతో దూకుడుగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. తాజాగా వివిధ దేశాలకు చెందిన రాయబారులపైనా బహిష్కరణ వేటు వేస్తున్నారు. యూఎస్‌లోని దక్షిణాఫ్రికాకు చెందిన రాయబారి ఇబ్రహీం రసూల్ పై వేటు వేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. దక్షిణాఫ్రికా రాయబారి ఇబ్రహీం రసూల్ ఈ గొప్ప దేశంలో ఉండేందుకు ఆహ్వానించదగిన వ్యక్తి కాదు అని అన్నారు. అధ్యక్షుడు ట్రంప్‌ను ద్వేషించే వ్యక్తి అని, ఆయన ఒక జాతి విద్వేష రాజకీయ నాయకుడు అని, దీనిపై ఆయనతో చర్చించాల్సింది ఏమీ లేదు అని రూబియో పేర్కొన్నారు. రసూల్ ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొని ట్రంప్ పరిపాలనకు వ్యతిరేకంగా విమర్శలు చేశారు. దీని కారణంగానే ఆయనపై బహిష్కరణ వేటు వేసినట్లు రూబియో సూత్రప్రాయంగా వెల్లడించారు. ఇక, ఈ బహిష్కరణపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇబ్రహీం రసూల్ 2010 నుంచి 2015 వరకు అమెరికాలో దక్షిణాఫ్రికా రాయబారిగా పనిచేశారు. ఆ తర్వాత ఈ యేడాది జనవరిలో తిరిగి ఆ పదవిని చేపట్టారు.

## త్వరలో భూమ్మీదకు సునీత విలియమ్స్



**వాషింగ్టన్:** అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీత విలియమ్స్ త్వరలోనే భూమ్మీద అడుగుపెట్టనున్నారు. నాసా–స్పేస్ ఎక్స్‌లు కలిసి చేపట్టిన క్రూ–10 మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగామిలతో కూడిన ఫాల్కన్–9 రాకట్ ఈరోజు ఉదయం 4.33 నిమిషాలకు కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 2024 జూన్‌లో సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్, నిక్ హేగ్, అలెగ్జాండర్ గోర్బునోవ్ మిషన్ క్రూ–9 మిషన్‌లో భాగంగా బోయింగ్ స్టార్‌లైనర్ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి వెళ్లారు. అయితే వీళు వెళ్లిన రాకెట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో%ా% నిక్ హేగ్, అలెగ్జాండర్ గోర్బోవ్‌లు తిరిగి భూమి మీదకు వచ్చారు. కానీ, సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ అక్కడే ఉండిపోయారు. దాదాపు 9 నెలలుగా అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌లోనే ఉంటున్నారు. అమెరికాలో రెండోసారి అధికారంలోకి రాగానే సునీతా, బచ్‌ని వెన్కక్కి తీసుకురావాలని నాసా–స్పేప్స్‌ను ఆదేశించారు. మూడు రోజుల క్రితమే క్రూ–10 మిషన్‌కు ఏర్పాట్లు చేశారు. దీంతో, సునీత, బచ్ మరో వారం రోజుల్లో భేమి మీదకు వచ్చే అవకాశం ఉంది.

## గ్రీన్‌కార్డుతో శాశ్వత నివాసం రాదు



గ్రీన్‌కార్డు ఉన్నంత మాత్రాన అమెరికా లో నిరంతరం ఉండలేరని, ఆ హక్కు గ్రీన్‌కార్డు హోల్డర్లకు ఉండబోదని, అమెరికా ప్రభుత్వం తలచుకుంటే వారిని వారి దేశాలకు డిపోర్ట్ చేయొచ్చు ని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి.వాన్స్ అన్నారు. అ మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ట్రంప్ గోల్డ్ కా ర్డ్'ద్వారా విదేశీయులు అమెరికాపౌరసత్వం పొం దొచ్చని, అయితే అందుకు ఐదు మిలియన్ డాలర్లను అమెరికాలో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంద న్న నేపథ్యంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా అనుకూల కార్యకలాపాలు నిర్వహించినందుకుగాను కొలంబియా యూనివర్శిటీ విద్యార్థిని డిపోర్ట్ చేసే విషయం గురించి చెబుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ కార్డు అనేది ప్రవాస చట్టాన్ని ఉల్లంఘించే చర్యలు చేపట్టనంత వరకు అమెరికాలో ఉండి, పనిచేసుకునే శాశ్వత నివాస హక్కును ఇస్తుంది. అమెరికాలో అత్యధిక గ్రీన్ కా ర్డులు కలిగిన వారిలో రెండో స్థానం భారతీయుల దే. 'అమెరికా అధ్యక్షుడు లేక విదేశాంగ కార్యదర్శి ఏ ప్రవాసి అయినా తమ దేశంలో ఉండకూడదనుకుంటే అలాంటి వారికి చట్టబద్ధంగా నివసించే హక్కు ఉండదు' అని వాన్స్ వివరించారు.

## డెన్వర్ విమానాశ్రయంలో అమెరికా విమానానికి మంటలు



అమెరికాలోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం గేట్ వద్ద గురువారం అమెరికా ఎయిర్‌లైన్స్ విమానంకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దాంతో అప్రమత్తం అయిన సిబ్బంది వెంటనే ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారా ప్రయాణికులను బయటకు పంపించారు. గురువారం మధ్యాహ్నం గేట్ సి38 వద్ద ఆ విమానం ఉన్నప్పుడు మంటలు చెలరేగాయని అనేక వార్తా సంస్థలకు విమానాశ్రయం ప్రతినిధి వెల్లడించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని అధికారులు వెల్లడించారు. కొలరాడో స్ప్రింగ్ ఎయిర్‌పోర్ట్ నుంచి డాలస్ ఫోర్ట్‌వర్త్‌కు బయలుదేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంకు సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. ఇంజిన్‌లో కంపనాలు చోటుచేసుకోవడంతో దానిని వెంటనే డెన్వర్ విమానాశ్రయానికి అత్యవసరంగా మళ్లించి దించేశారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. చూస్తుండగానే విమానం అంతా దగ్ధమయిపోయింది. ఈ ఘటన సమయంలో విమానంలో 172 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. అగ్నిమాపక్ సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి సాయంత్రానికల్లా మంటలను ఆర్పేశారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. కాగా ఈ ఘటనకు సంబంధించి విమానం రెక్కపై ప్రయాణికులు నిలుచుని ప్రాణాలు దక్కించుకున్న ఫోటోను 'సిబిఎస్ న్యూస్' షేర్ చేసింది. రెక్క వెనుక పొగ ఆవరించి ఉండడం కూడా ఆ ఫోటోలో స్పష్టంగా కనిపించింది. అదృష్టంకొద్దీ అంతా క్షేమంగా బయటపడ్డారు.

## ఆర్ఎస్ఎస్ భారత్ పాలిట రాచపుండే



**కోచి:** భారత్ పాలిట రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాచపుండేనని మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ శుక్రవారం పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలకు తానేమీ చింతించడం లేదని, క్షమాపణలు చెప్పాల్సిన అవసరమే లేదని ఆయన తేల్చిచెప్పారు. 'నేనన్నదానికి క్షమాపణలు చెప్పాలని వారు కోరుకుంటున్నారు. నా ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. కానీ నేనది చేయను. ఒకసారి అన్న తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడంలో లేదా క్షమాపణ చెప్పడంలో నాకు నమ్మకం లేదు' అని తుషార్ గాంధీ చెప్పారు. ఎర్నాకులంలోని అలువాలో యూనియన్ క్రిస్టియన్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకోమ్ సత్యాగ్రహంలో పాల్గొన్న తర్వాత మహాత్ముడు మార్చి 18, 1925న ఈ సంస్థను సందర్శించారు. ఆయన పర్యటన వందేళ్ళ వేడుకల సందర్భంగా కేంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తుషార్ ప్రసంగించారు. శివగిరి మాధమ్ వద్ద మహాత్ముడితో శ్రీ నారాయణ గురు సమావేశం శత వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ప్రసంగంలో తుషార్, ఆర్ఎస్ఎస్‌పై పైవ్యాఖ్యలు చేశారు. తిరువనంత పురం శివార్లలో ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యకర్తలు బుధవారం సాయంత్రం తుషార్ గాంధీని నిర్బంధించారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంఘట నతో దేశద్రోహులను ఎండగట్టాలన్న తన కృతనిశ్చయం మరింత బలోపేతమైం దని ఆయన వ్యాఖ్యానించారు. పైగా, ప్రతిపక్షాన్ని కూడా గౌరవించే సంస్కృతి మలయాళీలదని, ఇక్కడ ప్రజల హక్కులు పరిరక్షించబడతాయని అటు వంటి కేరళలో ఇలాంటి సంఘటన జరగడం తనకు దిగ్భ్రాంతి కలిగిం చిందన్నారు. ఈ తరహా విషపూరితమైన ప్రజలను రాష్ట్రం నుండి బయటకు పంపించాలన్నారు. స్వాతంత్ర్య పోరాటం కన్నా మరింత ముఖ్యమైనది ఈ పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మనందరికీ ఉమ్మడి శత్రువు వున్నారన్నారు.

# కాంగ్రెస్ నాయకుడు ఎండి రజాక్

# హత్య కేసులో కానరాని పురోగతి

## - పార్టీ సీనియర్ నాయకుడు ఎండి రైసుద్దీన్




**మెట్ పల్లి (మన వెలుగు) మార్చి 16 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రజాక్ హత్య జరిగి ఏడాదిన్నర గడుస్తున్న అసలైన హంతకులు వణుకు బెనుకు లేకుండా ఇప్పటికీ ప్రజల మధ్య దర్జాగా తిరుగుతున్నారని కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. దీనిపై ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు ఎండి రైసుద్దీన్ ఆధ్వర్యంలో, పార్టీ నాయకులు స్థానిక సి ఐ ఎస్సై లకు వినతి పత్రం సమర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరుస హత్యలతో అట్టుడికిన మెట్పల్లి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రజాక్ హత్య తీవ్ర సంచలనం రేపడమే గాక అప్పట్లో కోరుట్ల నియోజకవర్గంలో శాంతి భద్రతల వైఫల్యం రాష్ట్రవ్యాప్తంగా చర్చనియాంశమైందని అన్నారు. హంతకులను పెంచి పోషిస్తున్న సదరు రాజకీయ నాయకులు.. ఈ హత్యతో సంబంధమున్న అసలైన హంతకులకు పరోక్షంగా మద్దతిస్తున్నారని, వారి అండతోనే అసలైన హంతకులు జనం మధ్య బహిరంగంగా తిరుగుతున్నారని మండిపడ్డారు. 16.8.2023 రోజున నిజామాబాదు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశం పాల్గొని తిరిగి వచ్చిన ఎండి రజాక్ ను తన స్వగ్రామం ఐలాపూర్ వెళ్తున్న క్రమంలో దారి కాచి కిరాతంగా హత్య చేశారని తెలిపారు. పోలీసులు దీనిని ప్రత్యేక కేసుగా పరిగణించి ఇట్టి కేసును పునః విచారణ చేసి తప్పించుకు తిరుగుతున్న అసలైన నేరస్తులను జైలుకు పంపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్, మెట్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్, నాయకులు ఆసిఫ్, పాపేష్, జయరాజ్, పొన్నాల ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులమని చెప్పి అక్రమ వసూళ్లు

# చేస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్టు

## - రెండు బైకులు , నాలుగు సెల్ ఫోన్లు , 24,900 రికవరీ




**హుజూర్ నగర్ (మన వెలుగు) మార్చి 16 :** పోలీసులమని చెప్పి బంగారు షాపుల యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్ళకు పాల్పడుతున్న నలుగురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్ నగర్ సి ఐ చరమందరాజు తెలిపారు . హుజూర్ నగర్ పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి ఐ తెలిపిన వివరాల ప్రకారం హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీనిధి జ్యువాలరి షాప్ యజమాని తుడిమల్ల నవీన్ కుమార్ కు ఈ నెల 8 న పోలీసు డిపి ఉన్న ఫోన్ నెంబరు తో కుప్పం ఎస్ ఐ ని మాట్లాడుతున్నాని ఫోన్ చేసి ఇక్కడ జరిగిన చోరీ సొత్తును మీ షాపులో అమ్మినట్లు నేరస్తులు ఒప్పుకున్నారని అది రికవరీ చేసి మీపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని,అలా జరగకూడదంటే డబ్బులు పంపించాలని బెదిరించారు . దీంతో బయపడిన సదరు షాపు యజమాని రూ 10వేలు ఫోన్ పే ద్వారా పంపించారు. కొద్దిసేపటి తరువాత తాను అటువంటి పనిచేయలేదని నిర్ధారించుకుని వచ్చిన బెదిరింపు కాల్ పై హుజూర్ నగర్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు . కేసు నమోదు చేసిన ఎస్ ఐ ముత్తయ్య నేరస్తులు ఉపయోగించిన సెల్ ఫోన్ ఆదారంగా దర్యాప్తు ప్రారంబించారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శనివారం గోపాలపురం శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు . రెండు ద్వి చక్ర వాహనాలపై హుజూర్ నగర్ వైపు వస్తున్న 4 గురిని అనుమానం తో ఆపి విచారించారు . పోలీసుల విచారణలో నల్లగొండ జిల్లా నిడమానూర్ గ్రామానికి చెందిన చింతలచెర్వు ప్రశాంత్ లారీ క్లీనర్, చింతలచెర్వు అక్షిత్ కుమార్ , షేక్ ఇర్ఫాన్ పశువుల వ్యాపారం, నల్లగొండ కు చెందిన షేక్ వాజీద్ లు ఈజీగా డబ్బులు సంపాదించాలానే ఉద్దేశ్యంతో ముఠా గా ఏర్పడ్డారు. గూగుల్ మ్యాప్ లో బంగారం షాప్ ల, యాజమానుల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు . ఇంటర్ నెట్ నుంచి పోలీసుల ఫోటోలు సేకరించి వాటిని సెల్ నెంబర్లకు డిపి లుగా పెట్టుకుని .... ఏడాదికాలంగా పలువురు బంగారం దుకాణా దారులను బెదిరించి అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డట్లు నేరం అంగీకరించారు . చింతలచెర్వు ప్రశాంత్ ఈ నెల మొదటి తేదీన తిరుమలగిరి గ్రామానికి చెందిన శివ కుమార్ జ్యుయలరీ షాపు యజమానికి ఫోన్ చేసి రాజంపేట్ ఎస్ ఐ మాట్లాడుతున్నాని చోరీ సొత్తు కొన్నావు అని నీపైన కేసు కాకుండా ఉండాలంటే లక్ష రూపాయలు కావాలని బెదిరించాడు . దీంతో షాపు యజమాని రూ 52 వేలు ఫోన్ పేచేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్ లు రూ 24,900 నగదు రికవరీ చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ తెలిపారు . పోలీసులు, ప్రభుత్వాదికారుల మని చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తే పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని కోరారు . మీడియా సమావేశంలో శంభయ్య,నాగరమేష్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిపక్షాలు విస్మరిస్తున్నాయి

## - కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి

**మెట్ పల్లి (మన వెలుగు) మార్చి 16 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ప్రతిపక్ష పార్టీలు విస్మరిస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు. ఆదివారం స్థానిక పాత్రికేయులకు పత్రిక ప్రకటనను విడుదల చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కోటి సంఖ్యలో మహిళలు ఈ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సులను, పెట్రోల్ బంకులు, ఇతర కొన్ని సంస్థలను మహిళా సంఘాలకే అప్పజెప్పిన ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదాని తెలిపారు. అంతేకాకుండా విద్యారంగా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంశంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను ఇప్పించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇలా మహిళలు, విద్యార్థులు, కార్మిక కర్షకులతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీ నేతలు అనవసరమైన విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అనవసరపు విమర్శలు మానుకొని ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వంతో సహకరించాలని హితువు పలికారు.

# బుగ్గారం సర్పంచ్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయండి

## - ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
జిల్లా కలెక్టర్(పం.వి.) జగిత్యాల గారి కార్యాలయము
నెం.ఏ3/1501/2020-పం. తేది:10 .03.2025.

విషయము: పంచాయతీలు – గ్రామపంచాయతీ బుగ్గారం మం.బుగ్గారం పరిధిలో నిధుల దుర్వినియోగం జరిగినదని శ్రీ చుక్క గంగారెడ్డి గారిచే సమర్పించిన దరఖాస్తుపై విచారణ –గౌరవ లోకాయుక్తా నందు తుది విచారణ ఉత్తర్వులు విడుదల – తదుపరి చర్యలు గైకొనుటకు ఆదేశించుట గురించి.

సందర్భము: 1) శ్రీయుత రిజిస్ట్రార్ గౌరవ లోకాయుక్త గారి లేఖ నెం.LR.DIS.No.1432/2022/B1/LOK/12133/2022/ తేది:21.12.2022 ఈ కార్యాలయానికి వచ్చిన తేది:30.12.2022.
2) శ్రీయుత జిల్లా కలెక్టర్(పం.వి.)జగిత్యాల గారి షోకాజు నోటీసు నెం.:ఏ3/1501/2020-పం.,తేది:25.09.2023.
3) శ్రీమతి మూల సుమలత సర్పంచు గ్రా.పం.బుగ్గారం గారి సంజాయిషీ తేది:09.10.2023.
4) డివిజనల్ పంచాయతీ అధికారి, మెటుపల్లి గారి విచారణ నివేదిక నెం.M1/03/2023-పం., తేది:17.01.2024.
5) శ్రీయుత జిల్లా కలెక్టర్(పం.వి.),జగిత్యాల గారి ఉత్తర్వులు నెం.A3/1501/2020-పం. తేది:20.01.2024.
6) శ్రీయుత జిల్లా కలెక్టర్(పం.వి.) జగిత్యాల గారి ఉత్తర్వులు నెం.A3/1501/2020-పం. తేది:20.01.2024.
7) గౌరవ ఉన్నత న్యాయస్థానం తెలంగాణ వారి IA.No.1 OF 2024 IN WP NO.1750 OF 2024, Dt:24.01.2024.
8) శ్రీయుత జిల్లా కలెక్టర్(పం.వి.) జగిత్యాల గారి ఉత్తర్వులు నెం.A3/1501/2020-పం.,

**బుగ్గారం (మన వెలుగు) మార్చి 16 :** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ మూల సుమలత పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామ పంచాయతీలో భారీగా నిధులు దుర్వినియోగం అయిన కారణంగా చుక్క గంగారెడ్డి పిర్యాదుల మేరకు లోకాయుక్త న్యాయస్థానం యొక్క జస్టిస్ సి. వి.రాములు గత డిసెంబర్ 6న జడ్జిమెంట్ జారీ చేశారు. బుగ్గారం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం, అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జడ్జిమెంట్ లో ఆదేశించారు. వ్యక్తిగతంగా నిధుల దుర్వినియోగాన్ని పరిశీలించి తగు కఠిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్‌ను లోకాయుక్త జస్టిస్ సి.వి.రాములు జారీ చేసిన ఉత్తర్వులలో ఆదేశించారు.లోకాయుక్త తీర్పు ప్రకారం నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ బుగ్గారం తాజా మాజీ సర్పంచ్ మూల సుమలత పై క్రిమినల్ కేసు నమోదు చేయుటకు బుగ్గారం మండల పంచాయతీ అధికారికి ఈనెల 10న జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ క్రిమినల్ కేసులపై తీసుకున్న చర్యల వివరాలను ఏడు రోజులలోగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.కాగా... మండల పంచాయతీ అధికారి అఫ్జల్ మియా గత వారం రోజుల నుండి కాలక్షేపం చేస్తూ నేటికీ ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయక పోవడం పలు అనుమానాలకు, పలు ఆరోపణలకు దారి తీస్తోంది.గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంలో ఎంపీఓ అఫ్జల్ మియా కూడా వాటా దారుడేనని పిర్యాదు దారుడు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. గతంలోనే ఎంపీవో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారని ఆయన వివరించారు. స్వయంగా జిల్లా కలెక్టర్ కు ఎంపిఓ పై ఆధారాలతో సహా పిర్యాదులు కూడా చేయడం జరిగిందని పిర్యాదు దారుడు చుక్క గంగారెడ్డి తెలిపారు.

# చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్



**గొల్లపల్లి (మన వెలుగు) మార్చి 16 :** గొల్లపల్లి మండల కేంద్రంలోనీ ఆర్యవశ్య భవన్ లో సిఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం 32 లక్షల 31 వేల రూపాయల విలువ గల 105 చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**కరీంనగర్ ప్రతినిధి (మన వెలుగు) మార్చి 16 :** సమాజంలో మారుతున్న దృక్పథానికి నిదర్శనంగా, ఓ కుమార్తె(శశికళ ) తన తండ్రికి తలకొరివి నిర్వహించిన సంఘటన కరీంనగర్ పట్టణంలోని 31వ డివిజన్ లక్ష్మి నగర్లో ఆదివారం చోటుచేసుకుంది.68 ఏళ్ల గోపు నారాయణరెడ్డి, దినసరి కూలీగా జీవనం సాగిస్తూ, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ. శనివారం ఆయన మరణించగా, కుటుంబంలో కుమారులు లేకపోవడంతో కుమార్తెనే తండ్రికి తలకొరివి పెట్టింది. ఈ ఘటన కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో జరిగింది.సాధారణంగా, హిందూ సంప్రదాయాల్లో కొడుకులే తలకొరివి నిర్వహించే ఆచారం కొనసాగుతుండగా, ప్రస్తుతం మహిళలు కూడా ఈ విధి నిర్వహణలో ముందుకు రావడం సమానత్వానికి నిదర్శనంగా మారుతోంది.సమాజంలో మారుతున్న దృక్పథం స్థానికులు ఈ సంఘటనను పురోగమిస్తున్న సమాజం, లింగ సమానత్వానికి ప్రతీకగా అభివర్ణిస్తున్నారు. “ఈరోజుల్లో కూతుళుకూడా తమ బాధ్యతను సమర్థంగా నిర్వహించగలరు” అని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సంఘటన మహిళల హక్కులపై అవగాహన పెరుగుతోందని, కుటుంబ బాధ్యతలు లింగభేదం లేకుండా పంచుకోవచ్చని నిరూపించిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మాజీ మంత్రి జగదీష్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



**కొడంగల్ (మన వెలుగు) మార్చ్ 16:** కొడంగల్ నియోజకవర్గం లోని దౌల్తాబాద్ మండల కేంద్రం లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మరియు కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిని అవమానించారు అని కాంగ్రెస్ కార్యకర్తలు వారి డిస్టిబొమ్మ దహనం చేశారు.బి ఆర్ ఎస్ 10 సంవత్సరాల పాలనలో చేయలేని మంచి చేస్తున్నందుకు ఓర్వలేక ఇటువంటి ఆరోపణలు చేస్తూ సభను అడ్డగించడమే కాకా సభలో శభాధ్యక్షులకు గారవం ఇవ్వడం లేదు అని మండిపడ్డారు. ఇటువంటి వాటిని సహిస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు జంగం వీరన్న సార్ గారు, ఓలిగిరి మహిపాల్, బీజ్జరం నరేందర్, మాజీ ఎంపీటీసీ కుర్మనీ దస్తప్ప,శివరాం సింగ్,మలే అంజి మరియు కార్యకర్తలు పాల్గొని డబ్బు చాపుల్ల మధ్య దిష్టి బొమ్మ దహనం చేశారు.

# తెలంగాణలోనే రెండో అతిపెద్ద మల్లన్న బోనాల జాతర



**మెట్ పల్లి (మన వెలుగు) మార్చి 16 :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దపూర్ లో ఆదివారం మల్లన్న ఆలయంలో ఉదయం నుండే భక్తులు పోటెత్తారు అంగరంగ వైభవంగా జరిగింది కాముడి పౌర్ణమి మొదటి ఆదివారం నిర్వహించే బోనాల జాతరలో వేలాది మంది భక్తులు బోనాలతో పెద్దపూర్ వచ్చారు కోరిన కోర్కెలు తీర్చే మల్లికార్జున స్వామిని స్థానికులతో పాటు చుట్టూ పక్కల జిల్లాలు, పక్క రాష్ట్రాల భక్తులు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. మల్లన్నకు ఇష్టమైన ఆదివారం రోజున గత 29 ఏండ్లుగా గ్రామస్థులు ప్రతి ఆదివారం మాంసాహారం మద్యం ముట్టుకోకుండా నియమ నిష్టలతో ఉంటారు. ఆదివారం మల్లన్న ఆలయంలో ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

## కలిసొచ్చిన అదృష్టం

# రూ. 10 వేల సిప్‌తో చేతికి రూ.2 కోట్లు




ఇది లార్జ్, మిడ్-క్యాప్ ఈక్విటీ ఫండ్ల వర్గంలోకి వస్తుంది. ఈ స్కిమ్‌ను మార్చి 11, 2005న ప్రారంభించారు. ఇది బాటమ్-అప్ స్టాక్ పెట్టుబడి వ్యూహాన్ని ఉపయోగిస్తుంది. ఈ ఫండ్ భవిష్యత్తులో సంపన్నులు అయ్యే అవకాశం ఉన్న మిడ్‌క్యాప్ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెడుతుంది.. మీరు లక్షాధికారి కావాలనుకుంటున్నారా? అలా అయితే, ఈ వార్త మీ కోసమే. చాలా మంది నేరుగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడానికి బదులుగా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడుతున్నారు. మ్యూచువల్ ఫండ్లలో వాటా ల ద్వారా లక్షాధికారిగా మారడం సాధ్యమే. కానీ దానికి క్రమశిక్షణ, ఓర్పు, సరైన వ్యూహం అవసరం. అలాంటి ఒక నిధి కెనరా రోబెకో ఎమర్జింగ్ ఈక్విటీస్ ఫండ్. ఈ పథకం వల్ల కేవలం రూ.10 వేల వాటా పెట్టుబడిదారులు మాత్రమే లక్షాధికారులు అయ్యారు. కెనరా రోబెకో ఎమర్జింగ్ ఈక్విటీ ఫండ్ 20 సంవత్సరాలలో నెలకు కేవలం రూ.10,000 వాటా ని రూ.1.9 కోట్లుగా మార్చింది. ఆ పెట్టుబడిదారుడు ఈ పథకంలో నెలకు రూ.10,000 చొప్పున 10 సంవత్సరాలు పెట్టుబడి పెట్టి ఉంటే నేడు డబ్బు విలువ రూ.28.47 లక్షలు అయ్యేది. ఇది లార్జ్, మిడ్-క్యాప్ ఈక్విటీ ఫండ్ల వర్గంలోకి వస్తుంది. ఈ స్కిమ్‌ను మార్చి 11, 2005న ప్రారంభించారు. ఇది బాటమ్-అప్ స్టాక్ పెట్టుబడి వ్యూహాన్ని ఉపయోగిస్తుంది. ఈ ఫండ్ భవిష్యత్తులో సంపన్నులు అయ్యే అవకాశం ఉన్న మిడ్‌క్యాప్ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెడుతుంది. ఈ మ్యూచువల్ ఫండ్ పథకంలో ఐసిఐసిఐ బ్యాంక్, ఇండియన్ హోటల్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి ప్రధాన కంపెనీల షేర్లు ఉన్నాయి. ఇదే సమయంలో నెలకు రూ.10 వేల చొప్పున సిప్ చేసిన వారికి ఇన్నేళ్లలో చేతికి రూ. 2 కోట్ల వరకు రావడం విశేషం. చాలా వరకు సిప్ పెట్టుబడుల కోసమే జనం ఆసక్తి చూపిస్తుంటారు. ఇక 2025, జనవరి 31 వరకు ఈ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఈక్విటీల్లో 98.30 శాతం పెట్టుబడులు పెట్టగా.. 1.70 శాతం ఇతర ఆస్తుల్లో పెట్టుబడులు పెడుతుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ అలొకేషన్ విషయానికి వస్తే.. ఈ ఫండ్ లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో 46.84 శాతం, మిడ్ క్యాప్ స్టాక్స్‌లో 35.32 శాతం, ఇతర అసెట్స్‌లో 1.70 శాతం, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో 16.15 శాతంగా వాటా ఉంది.

# బీమా రంగంలోకి పతంజలి

ప్రముఖ కార్పొరేట్, యోగా గురు రామ్‌దేవ్ బాబా తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించా రు. తాజాగా మాగ్మా జనరల్ ఇన్సూరె న్స్‌లో పతంజలి అయుర్వేద్ మెజారిటీ వాటాను కొనుగోలు చేసింది. దీంతో రామ్‌దేవ్ బాబా బీమా వ్యాపారంలోకి ప్రవేశించినట్లయ్యింది. మగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కొనుగోలు తర్వాత ఆ సంస్థలో పతంజలి ప్రధాన ప్రమోటర్‌గా మారనుంది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో తమ వాటాను విక్రయించే ప్రధాన విక్రేతలలో సెనోటి ప్రాపర్టీస్, సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వైజరీ సర్వీసెస్, కేకి మిస్త్రీ, అతుల్ డిపి ఫ్యామిలీ ట్రస్ట్, షాహి స్టెర్లింగ్ ఎక్స్‌పోర్ట్స్, షాహి స్టెర్లింగ్ ఎక్స్‌పోర్ట్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో అధర్ పూనావాలాకు చెందిన సెనోటి ప్రాపర్టీస్ ఏకంగా 74.5 శాతం వాటాను కలిగి ఉంది. అది ఇప్పుడు పతంజలి గ్రూపునకు బదిలీ కానుంది. అయితే ఎంత మొత్తానికి కొనుగోలు ఒప్పందం జరిగిందనే విషయాన్ని ఆయా సంస్థలు వెల్లడించకపోవడం గమనార్హం. నూతన యాజమాన్యం పతంజలి అయుర్వేద్, డిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ బీమా కంపెనీ మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నానని అదార్ పూనవల్లా పేర్కొన్నారు. తమ సంస్థలో 18,000 మంది ఏజెంట్లు, 2,000 కార్పొరేట్లు, ఫైనాన్సియల్ రంగంలో 80 సంస్థలతో కార్యకలాపాలను కలిగి ఉందన్నారు. గడిచిన ఐదేండ్లలో సగటున 26 శాతం వృద్ధిని సాధించామన్నారు.

## వచ్చే ఆర్థిక సంవత్సరం ఐటీలో

# 1.5 లక్షల ఫ్రెషర్ల నియామకాలు




ఐటీ రంగంలో మళ్లీ ఉద్యోగావకాశాలు పెరగనున్నాయని, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రాంగణ నియామకాల జోరు పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫ్రెషర్ల నియామకాలు 1.5 లక్షల స్థాయిని దాటవచ్చని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోలిస్తే దాదాపు రెట్టింపు కావచ్చన్న అంచనాలున్నాయి. ఈ నెలాఖరుతో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల ఫ్రెషర్ల హైరింగ్ 85,000-95,000కు పరిమితం కావచ్చని రిక్రూట్‌మెంట్ సేవల సంస్థ టీమ్‌లీజ్ భావిస్తోంది. సవాళ్ల సంద్రంలో ఐటీ: ప్రస్తుతం దేశీయ ఐటీ రంగం పలు సవాళ్లు ఎదుర్కోంటోంది. ఒకవైపు సాంకేతిక పరివర్తనం.. మరోవైపు ప్రధాన ఆదాయ వనరైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఐటీ వ్యయాలు తగ్గడం. ఈ రెండు కారణాల వల్ల కంపెనీలు గత ఏడాదిలో ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించాయి. వ్యయ నియంత్రణ సాకుతో ఉద్యోగాల్లో కోతలు పెట్టాయి. ప్రాంగణ నియామకాలూ పరిమిత స్థాయిలోనే జరిగాయి. ఐటీ రంగంలో ఇప్పుడిప్పుడే హైరింగ్ మళ్లీ పెరుగుతోందని, కంపెనీలు ముఖ్యంగా ఫ్రెషర్లతో పాటు ప్రత్యేక నిపుణుల నియామకాలపై దృష్టిసారించాయని రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలంటున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తన నిపుణులకు డిమాండ్ పెరిగిందని టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతి శర్మ తెలిపారు. మళ్లీ మాంద్యం భయాలు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డనతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరిగింది. యూఎస్ మళ్లీ మాంద్యంలోకి జారుకోవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో ఆర్థిక మాంద్యం మన ఐటీ రంగానికి ప్రతికూల పరిణామమే. కాస్త మెరుగువుతూ వస్తున్న నియమాకాల సెంటిమెంట్‌ను మళ్లీ దెబ్బతీయవచ్చని కొందరు భావిస్తున్నారు. జెనరేటివ్ ఏఐతో వచ్చిన సాంకేతిక పరివర్తన కారణంగా ఐటీ రంగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారికి భారీగా డిమాండ్ నెలకొందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ నిపుణులకు ఆకర్షణీయ పారితోషికం ఆఫర్ చేసేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని రిక్రూటింగ్ ఏజెన్సీలంటున్నాయి. ఫ్రెషర్లు కోడింగ్‌తో పాటు ఆధునిక టెక్నాలజీల్లోనూ ప్రావీణ్యం సాధించగలిగితే భారీ వేతనంతో కూడిన ఉద్యోగం దక్కించుకోవచ్చని వారంటున్నారు.

# బంగారం ధర ఇంత పెరిగిందా..?



బంగారం ఒక ప్రధాన పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. వివాహాలు, పండుగలలో అపారమైన ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ సంఘటనలు, డిమాండ్, సరఫరా వంటి అనేక కారణాల వల్ల ఈ ధరలు మారుతూ ఉంటాయి. బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బంగారం ధరలు అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి. మన భారతీయ సాంప్రదాయంలో బంగారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారు. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలలో బంగారం షాపులన్ని మహిళలతో కిటకిటలాడుతాయి. తాజాగా మార్చి 14న బంగారం ధరలు భారీగా పెరిగాయి. వెండి కూడా అదే బాటలో వెళుతోంది. ఈ ధరలు రాత్రి 9 గంటల సమయానికి నమోదైనవి మాత్రమే. దేశీయంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా 11,00 వరకు పెరుగగా, అదే 24 క్యారెట్లపై రూ.1200 వరకు ఎగబాకింది. ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.82,300 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర రూ.89,780 వద్ద కొనసాగుతోంది. అంటే రూ.90 వేల చేరువలో ఉంది. రానున్న రోజుల్లో లక్ష రూపాయలు దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం వెండి ధర కిలోపై ఏకంగా రూ.2000 వరకు పెరిగింది. ప్రస్తుతం కేజీ సిల్వర్ ధర రూ.1,03,000 ఉండగా, చెన్నై, హైదరాబాద్, కేరళ రాష్ట్రాల్లో రూ.1,12,000 వరకు ఉంది. ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోళ్లు పెరగడం ఈ ర్యాలీకి కారణమయ్యాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, యూరోపియన్ దిగుమతులపై 200% సుంకాలు విధించాలనే ట్రంప్ నిర్ణయం కారణం కావచ్చు. గత సంవత్సరం కాలంగా ప్రపంచ ఆర్థిక అస్థిరత, కేంద్ర బ్యాంకులు డాలర్ ఆధారిత నిల్వల నుండి దూరంగా ఉండటం వలన బంగారం డిమాండ్ పెరిగింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మధ్య పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించడంతో కేంద్ర బ్యాంకులు తమ బంగారం నిల్వలను పెంచుకున్నాయి. 2024 లో పోలాండ్, టర్కియే, భారతదేశం అతిపెద్ద కొనుగోలుదారులు. దేశీయంగా, అంతర్జాతీయంగా వివిధ కారణాల వల్ల బంగారం, వెండి ధరలు నిరంతరం హెచ్చుతగ్గులకు లోనవుతాయి. ప్రపంచవ్యాప్త డిమాండ్, కరెన్సీ మార్పిడి రేట్లు, వడ్డీ రేట్లు, ప్రభుత్వ విధానాలు, ప్రపంచ సంఘటనలు వంటి అంశాలు వాటి విలువను గణనీయంగా ప్రభావితం చేస్తాయి. బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థలు హోల్ మార్కులను ఇస్తాయి. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999 అని, 23 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 958 అని, 22 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 916 అని, 21 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 875 అని, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 750 అని రాసి ఉంటుంది. చాలా వరకు బంగారం 22 క్యారెట్లలో అమ్ముడవుతుండగా, కొంతమంది 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తారు. క్యారెట్ 24 మించకూడదు. అలాగే క్యారెట్ ఎంత ఎక్కువగా ఉంటే బంగారం అంత స్వచ్ఛంగా ఉంటుంది.

# మెట్రో నిర్వహణలోకి రైల్ వికాస్ నిగమ్..!



ప్రభుత్వ రంగంలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్) మెట్రో నిర్వహణ రంగంలోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ భాగస్వాములతో జట్టు కట్టడం ద్వారా మెట్రో కార్యకలాపాలు, నిర్వహణ వ్యాపా రాన్ని చేపట్టాలని యోచిస్తోన్నట్లు ఆర్‌విఎన్‌ఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ప్రదీప్ గౌర్ తెలిపారు. బెంగుళూరు మెట్రో ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ (ఒఅండ్ఎం) కాంట్రాక్టులను చేపట్టేందుకు జర్మనీకి చెందిన డ్యుయిష్ బాన్ (డిబి)తో చర్చలు జరుపుతున్నామని గౌర్ ఇటికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. భారత్‌లో మెట్రో ప్రాజెక్టుల కోసం ఒఅండ్ఎం చేపట్టేందుకు డిబి తమ కంపెనీని సంప్రదించిందన్నారు. బెంగళూరు మెట్రో కోసం ఈ భాగస్వామ్యాన్ని అంచనా వేస్తున్నామని చెప్పారు. అదే విధంగా చెన్నరు మెట్రో ప్రాజెక్టు కోసం ఒఅండ్ఎం హక్కులను పొందేందుకు ఆసక్తి చూపుతున్నామన్నారు. ఢిల్లీ-మీరట్ ప్రాంతీయ ర్యాపిడ్ రైల్ ప్రాజెక్ట్ కోసం జర్మన్ కంపెనీ ఇప్పటికే 12 సంవత్సరాల ఒఅండ్ఎం కాంట్రాక్టును కలిగి ఉందన్నారు."మేము ఇప్పటికే ఢిల్లీలో నమోభారత్ కారిడార్‌ను నిర్వహిస్తున్నాము. దేశంలో మరిన్ని ఒఅండ్ఎం ప్రాజెక్టలు లేదా భాగస్వామ్యాల కోసం చర్చలు జరుపుతున్నాము. మెట్రో రైలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులలో ఆర్‌విఎన్‌ఎల్ పాల్గొంటుంది." అని గౌర్ తెలిపారు. చెన్నరు, ఇండోర్, అహ్మదాబాద్, సూరత్, నాగ్‌పూర్, పుణెలలో మెట్రో ప్రాజెక్టులను చేపట్టనున్నామన్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, యుఎఇ, టర్కీ, పెరూ దేశాల్లోనూ తమ కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ మొత్తం రూ.1 లక్ష కోట్ల ఆర్డర్ బుక్‌లో విదేశీ పోర్టుపోలియో వ్యాపారం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. వీటిని మొత్తం ఆర్డర్‌లో 50 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాము రైల్వేయేతర ప్రాజెక్టలలో ట్రాన్స్‌మిషన్ లైన్లు, సోలార్ ప్రాజెక్టలు, జాతీయ రహదారులను కూడా కలిగి ఉన్నామన్నారు.

# ఎస్‌బిఐ వడ్డీ రేట్లు తగ్గొచ్చు




రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తదుపరి ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో వడ్డీ రేట్లను తగ్గించొచ్చని ఎస్‌బిఐ రీసెర్చ్ ఎకోరాప్ తాజా రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషించింది. దాదాపు ఐదేళ్ల తర్వాత ఇటీవల ఆర్‌బిఐ నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సంజరు మల్హోత్రా ఆర్బీఐ గవర్నర్ ఫిబ్రవరి సమీక్షలో వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గవచ్చని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఎస్‌బిఐ రిసెర్చ్ అంచనా వేసింది.

# ఓజి తర్వాత సినిమాలకు పవన్ సెలవు ?



ఏపీ డిప్యూటీ సిఎంగా కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు పూర్తి చేయాల్సినవి కాకుండా భవిష్యత్తులో కొత్త సినిమాలు చేస్తారా చేయరానే అనుమానాలు అభిమానుల్లో లేకపోలేదు. రాజకీయాలు, సామజిక సేవ, ప్రజా క్షేమమే తన ప్రాధాన్యతలని పవన్ గత కొన్ని నెలల్లో పలు సందర్భాల్లో నొక్కి చెప్పారు. నిన్న జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవంలోనూ అదే సందేశం వినిపించింది. సభకు హాజరైన అభిమానులు ఓజి ఓజి అని అరుస్తూ ఉంటే కార్యకర్తల గౌరవం కోసం ఎలాంటి నినాదాలు చేయొద్దని వారించడం చూస్తే ఉపముఖ్యమంత్రి ఆలోచనలు సినిమాల మీద తగ్గినట్టే అనిపిస్తోంది. ఒకవేళ ఆ నిర్ణయమే తీసుకుంటే నిజంగా సమర్ధించాల్సిందే. ఎందుకంటే పవన్ కు తీరిక లేకపోవడంతో పాటు ఆరోగ్యం తరచుగా ఇబ్బంది పెడుతోంది. తన రెండో కొడుకుని ఎత్తుకోలేనంత బలహీనంగా అయ్యానని, మీ అండదండలతో ముందుకు వెళ్తానని చెప్పడం అభిమానులను కదిలించింది. ఈ లెక్కన హరిహర వీరమల్లు 1 మేలో విడుదలయ్యాక ఈ సంవత్సరం లేదా వచ్చే ఏడాది ఓజితో పవన్ ఇక సినిమాలకు స్వస్తి చెప్పినా ఆశ్చర్యం లేదు. వాస్తవంలోనూ పవర్ స్టార్ కథలు వినడం లేదు. గతంలో సురేందర్ రెడ్డితో అనుకున్న ప్రాజెక్టు సైతం ముందుకెళ్లలేక క్యాన్సిలయ్యేలా ఉందని వినికిడి. ఒకరకంగా చెప్పాలంటే ఉస్తాద్ భగత్ సింగ్ జరిగినా గొప్పే అనుకోవాలి. సో దీంతో పాటు హరిహర వీరమల్లు రెండు భాగాలు, ఓజితో ఫ్యాన్స్ సంతృప్తి పడాల్సి ఉంటుంది. గతంలో అజ్ఞాతవాసితో ఆపేసి పూర్తి స్థాయి రాజకీయాల్లో ఉంటానని చెప్పిన పవన్ ఆ తర్వాత ఓటమి, పార్టీ నడపడానికి నిధులు అవసరమై తిరిగి సినిమాలు కొనసాగించారు.

# ఛావాకు రెండో బ్రేక్ పడింది



మూడు వారాలు ఆలస్యంగా విడుదలైనా మంచి వసూళ్లతో తెలుగు వెర్షన్ బోణీ మొదలుపెట్టిన ఛావాకు వసూళ్లు బాగానే నమోదవుతున్నా ఏదో ఒక బ్రేక్ పడుతూనే ఉంది. ఇప్పటిదాకా సుమారు పద్నాలుగు కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందని ట్రేడ్ టాక్. దీని ఇండియా వైడ్ రేంజ్ కి ఇది కొంచెం తక్కువే అయినా డబ్బింగ్ అందులోనూ మరాఠి వీరుడి కథకి టాలీవుడ్లో ఇంత ఆదరణ దక్కడం విశేషమే. అయితే రిలీజ్ టైంలో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు రూపంలో కలెక్షన్లు కొంత ప్రభావితం కాగా తాజాగా కోర్ట్ చూపిస్తున్న జోరు ఛావాకు ఇంకో ప్రతిబంధకంగా మారింది. ఆడియన్స్ కి మరో ఛాయస్ దొరకడంతో షిఫ్ట్ అయిపోతున్నారు. సో ఛావా ఫైనల్ రన్ కు దగ్గరగా ఉన్నట్టే. దేశవ్యాప్తంగా ఏడు వందల కోట్లు వసూలు దాటేసిన ఈ హిస్టారికల్ డ్రామా సహస్రం అందుకుంటుందా లేదానే దాని గురించి బాలీవుడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఛావా ఇప్పటికీ నెమ్మదించలేదు. ముఖ్యంగా మహారాష్ట్రలో ఏకంగా పుష్ప 2ని దాటేసి సరికొత్త బెంచ్ మార్కులు సృష్టించింది. ఢిల్లీ, ముంబై సర్క్యూట్స్ లో కలెక్షన్లు స్ట్రాంగ్ గా ఉన్నాయి. తెలుగు నుంచి కనీసం ఒక యాభై కోట్ల గ్రాస్ ని నిర్మాతలు ఆశించారు కానీ ఇప్పుడది నెరవేరే సూచనలు తగ్గిపోయాయి. పాతిక కోట్లను అందుకోవడమే అచీవ్ మెంటని చెప్పొచ్చు. నెమ్మదించిన సంగతి పక్కనపెడితే ఛావాకు మార్చ్ 26 దాకా ఛాన్స్ ఉంది. మధ్యలో చెప్పుకోదగ్గ రిలీజులేం లేవు. కోర్ట్ నిలబడింది కానీ కిరణ్ అబ్బవరం దిల్ రుబాకు వస్తున్న స్పందన చూస్తుంటే దాన్ని కొంతమేరకు ఛావా వాడుకోవచ్చు. పంపిణి చేస్తున్న గీత ఆర్ట్స్ ప్రమోషన్స్ ఆపేసింది. ఎలాగూ జనంలోకి వెళ్ళిపోయింది కాబట్టి కొత్తగా హంగామా చేయాల్సిన పని లేదన్న ఉద్దేశంతో సైలెంటయ్యింది. పరీక్షల సీజన్ కావడం కూడా ఛావాకు ఒక అడ్డంకి. పిల్లలను థియేటర్లకు దూరంగా ఉంచిన తల్లితండ్రులు తాము కూడా ఇంటికే పరిమితమయ్యారు. దీని వల్ల ఛావా రీచ్ మీద ప్రభావం పడిందన్నది వాస్తవం.

# హిట్ 3 బుకింగ్స్ మొదలెట్టొచ్చు




కోర్ట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో నాని మాట్లాడుతూ ఒకవేళ ఈ సినిమా నచ్చకపోతే హిట్ 3 చూడొద్దంటూ పిలుపునివ్వడం ఎంత హాట్ టాపిక్ అయ్యిందో చూశాం. ఎంత నమ్మకం ఉన్నా మరీ ఇంత పెద్ద స్టేట్ మెంట్ ఇవ్వడం ఏంటని అభిమానులు కూడా ఆశ్చర్యపోయారు. కానీ నాని కాన్ఫిడెన్స్ మరోసారి గెలిచింది. కోర్ట్ యునానిమస్ విన్నర్ గా నిలిచింది. సాధారణంగా కోర్ట్ రూమ్ డ్రామాలు టాలీవుడ్ లో ఆడిన దాఖలాలు తక్కువ. ఇప్పుడు హిలేరియస్ అంటాం కానీ అప్పట్లో చెట్టు కింద ప్లీడర్ కూడా యావరేజే. వకీల్ సాబ్ వంద కోట్లు దాటలేదు. అందుకే కోర్ట్ విజయావకాశాల మీద అనుమానాలు లేకపోలేదు.ఇప్పుడవన్నీ బద్దలైపోయాయి. కోర్ట్ బుకింగ్స్ మొదటి రోజుకు పోటీగా శని ఆదివారాలు ఎక్కువగా జరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. పోటీలో ఉన్న వాటిని తోసిరాజని బుకింగ్ ట్రెండ్స్ లో జోరు చూపిస్తోంది. ఇప్పుడు నాని నిశ్చింతగా ఉన్నాడు. ఇవాళ జరిగిన సక్సెస్ ప్రెస్ మీట్ లో హిట్ 3 బుకింగ్స్ మొదలుపెట్టమంటారా అంటూ జోకేసినా తన మాట గెలిచిన ఆనందం మొహంలో కనిపించింది. హిట్ 3కి ప్రత్యేకంగా కోర్ట్ ద్వారా బజ్ రావాల్సిన అవసరం లేకపోయినా నాని హామీ వల్ల రెండింటికి ముడిపడింది. ఇప్పుడది తీరిపోవడంతో న్యాచురల్ స్టార్ అభిమానుల సంతోషం మాములుగా లేదు. మే 1 విడుదల కాబోతున్న హిట్ 3 ప్రమోషన్లు పాటల విడుదలతో వచ్చే వారం నుంచి మొదలుపెట్టొచ్చని సమాచారం. నాని ఈ ప్రాజెక్టుని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. మొదటి రెండు భాగాల్లో నటించిన విశ్వక్ సేన్, అడివి శేష్ ల కంటే తన మార్కెట్ పెద్దది కావడంతో బడ్జెట్ కూడా లెక్క చేయకుండా రిస్కీ లొకేషన్లో షూటింగ్ కి ఎస్ చెప్పాడు. దర్శకుడు శైలేష్ కొలను మీద నమ్మకంతో పెద్ద స్కేల్ మీద నిర్మించాడు. వయొలెన్స్ ఏ స్థాయిలో ఉంటుందో టీజర్ శాంపిల్ లో చూపించారు. ఇక ట్రైలర్ ఎలా ఉండబోతోందనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. థియేట్రికల్ బిజినెస్ పెద్ద ఎత్తున ఉండబోతోంది.

# కోర్ట్ ఓపెనింగ్...అదిరింది యువరానర్




నిర్మాతగా నాని జడ్జ్ మెంట్ ఎంత పర్ఫెక్ట్ గా ఉంటుందో కోర్ట్ రూపంలో మరోసారి ఋజువైపోయింది. ప్రీమియర్లతో కలిపి తొలి రోజు 8 కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందనే రిపోర్ట్ ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. సినిమా బాగుంటుందని ఆశించినా వసూళ్లు ఇంత వేగంగా పికప్ అవుతాయని భావించలేదని, కంటెంట్ నచ్చితే ప్రేక్షకులు ఎంత బాగా రిసీవ్ చేసుకుంటారో చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ అక్కర్లేదని బయ్యర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిన్న హోలీ సెలవు రోజుని పూర్తిగా వాడుకుంది కోర్ట్ ఒకటే. బుక్ మై షోలో గత ఇరవై నాలుగు గంటల్లో లక్షా ఇరవై వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం దానికి నిదర్శనం.ఈ రోజు శనివారం, రేపు ఆదివారం కోర్ట్ మరింత బలంగా నిలవనుంది. స్క్రీన్లు పెంచుతున్నారు. ముందు తక్కువంచనా చేసి పరిమిత షోలు వేసిన బిసి సెంటర్లలో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. స్టార్ క్యాస్టింగ్ లేకుండా ఒక సీరియస్ కోర్ట్ రూమ్ డ్రామాకు ఇంత స్థాయి స్పందన నిజంగా రికార్డే. పోటీలో ఉన్న దిల్ రుబాకు ప్రతికూల ఫలితం రావడంతో అధిక శాతం ప్రేక్షకులకు నాని మూవీనే ఛాయస్ అవుతోంది. నన్ను నమ్మండి అంటూ న్యాచురల్ స్టార్ ఇచ్చిన హామీకి న్యాయం జరిగింది. దగ్గర్లో కొత్త రిలీజులు పెద్దగా లేవు కాబట్టి కోర్ట్ ఫైనల్ నెంబర్స్ ఇప్పుడే ఊహించి చెప్పడం కష్టం. భారీగా ఉండబోతున్నాయి. ప్రియదర్శి, శివాజీతో పాటు హీరో హీరోయిన్లు హర్ష్, శ్రీదేవిలకు కోర్ట్ మంచి బ్రేక్ అవుతోంది. థియేటర్లలో సీన్లకు చప్పట్లు విజిల్స్ పడుతున్నాయి. కొన్ని లోపాలు,హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ జనం కోరుకున్న ఎంటర్ టైన్మెంట్ ని సీరియస్ గా ఇచ్చిన కోర్ట్ ఫైనల్ గా సూపర్ హిట్ ముద్ర దాటేసి బ్లాక్ బస్టర్ వైపు పరుగులు పెడుతోంది.

# ఖైదీ 2 ఎప్పుడు రావొచ్చంటే



సౌత్ ఇండియన్ మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్ గా పేరొందిన లోకేష్ కనగరాజ్ కు మర్చిపోలేని బ్రేక్ ఇచ్చింది ఖైదీ. తెలుగులో కార్తీ మార్కెట్ కి తిరిగి జీవం పోసింది కూడా ఈ బ్లాక్ బస్టరే. కేవలం ఒక రాత్రిలో జరిగే సంఘటనలు తీసుకుని పీక్స్ హీరోయిజం చూపించిన తీరుకి ఆడియన్స్ థ్రిల్ అయ్యారు. ఏకంగా విజయ్ లాంటి స్టార్ పిలిచి మరీ ఛాన్స్ ఇచ్చాడంటే అది ఖైదీ ప్రభావమే. అందుకే ఆ క్లాసిక్ అంటే అభిమానులకు తగని మక్కువ. అయితే ఆ సినిమాలో చాలా ప్రశ్నలు మిగిలిపోయాయి. ముఖ్యంగా కార్తీ ఎందుకు జైలుకొచ్చాడనే పాయింట్. ఇవన్నీ సీక్వెల్ లో చూపిస్తానని లోకేష్ చెబుతూ వచ్చాడు.రజనీకాంత్ కూలి తర్వాత ఖైదీ 2నే మొదలవుతుందని చెన్నై వర్గాలు గతంలో ఉటంకించాయి. తాజా అప్డేట్ ప్రకారం ఇప్పుడీ సీక్వెల్ 2026 ఏప్రిల్ కి వాయిదా వేశారట. అంటే దీనికన్నా ముందు మరో సినిమా తీస్తాడానే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సూర్యతో రోలెక్స్ ఏమైనా పట్టాలు ఎక్కిస్తాడానే డౌట్ కూడా వస్తోంది. క్లారిటీ ఏంటంటే కూలి ఈ దసరా లేదా దీపావళికి రిలీజవుతుంది. ఆ తర్వాత లోకేష్ కొంచెం బ్రేక్ తీసుకుంటాడు. అంటే డిసెంబర్ దాకా అనుకుందాం. కొత్త స్క్రిప్ట్ మొదలుపెట్టినా దానికో ఆరు నెలలు పైనే కావాలి. అంటే అటు ఇటుగా ఏప్రిల్ వచ్చేస్తుంది. సో ఖైదీ 2నే నెక్స్ట్ అనే క్లారిటీ వస్తున్నట్టేగా. రోలెక్స్ కి ఇంకా చాలా టైం పడుతుంది. ఎందుకంటే రెట్రో అయిపోయింది. 45వ సినిమా ఇంకా సగమే అయ్యింది. వెట్రిమారన్ వడివాసల్ కోసం సూర్య ఎక్కువ సమయం త్యాగం చేయాల్సి ఉంటుంది. వీటి మధ్యలో రోలెక్స్ అవ్వని పని. పోనీ విక్రమ్ 2 అనుకుంటే అటు కమల్ హాసన్ కూడా బిజీగా ఉన్నారు. సో ఖైదీ 2కి రూట్ క్లియర్ గా ఉందనేది ఓపెన్ సీక్రెట్. కాకపోతే ఖచ్చితంగా ఇదే మొదలవుతుందా లేక లోకేష్ మనసు మారుతుందా అనేది వేచి చూడాలి. విపరీతమైన అంచనాలు మోస్తున్న కూలి కనక బ్లాక్ బస్టర్ అయితే లోకేష్ పేరు దేశం దాటి మారుమ్రోగడం ఖాయం.

# అనుపమ సినిమాతో సమంత రీ ఎంట్రీ

ఖుషి తర్వాత స్క్రీన్ పై కనిపించకుండా పోయిన సమంతా తిరిగి ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. తన స్వంత ప్రొడక్షన్ లో రూపొందుతున్న మా ఇంటి బంగారం రిలీజ్ డేట్ గట్రా బయటికి చెప్పకుండా సైలెంట్ గా షూటింగ్ చేసేస్తున్నారు. సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ స్పందన అంతంత మాత్రంగానే రావడంతో బలమైన కంబ్యాక్ కోసం సామ్ ప్లాన్లు వేసుకుంటోంది. తన బెస్ట్ ఫ్రెండ్ దర్శకురాలు నందిని రెడ్డికి ఓకే చెప్పడం చూశాం. కానీ దీనికన్నా ముందే సామ్ ఒక సినిమాలో క్యామియో రూపంలో కనిపించనుంది. అదే అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్ చేస్తున్న పరదా. ఈ సినిమాలో సామ్ ఒక కీలక పాత్ర చేస్తోందని, క్యారెక్టర్ గెటప్ రెండూ విభిన్నంగా గతంలో చూడని తరహాలో ఉంటాయని టీమ్ నుంచి అందుతున్న సమాచారం. కొన్ని వారాల క్రితం రిలీజైన టీజర్ లో పరదా కంటెంట్ షాకింగ్ గా ఉండబోతోందనే క్లూస్ ఇచ్చారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ఈ విలేజ్ థ్రిల్లర్ లో దర్శన రాజేంద్ర, సంగీతలకు చాలా ప్రాధాన్యం ఉన్న పాత్రలు దక్కాయి. వీళ్లకు సమంతకున్న కనెక్షన్ ఏంటనేది సినిమాలోనే చూడాలని అంటున్నారు. సో అఫీషియల్ కంబ్యాక్ గా సామ్ కు పరదానే నిలవనుంది. విడుదల తేదీ ఇంకా నిర్ణయించలేదు కానీ వేసవిలోనే రాబోతోంది. ఇదలా ఉంచితే సమంత తర్వాత ఏం చేయనుందనేది ఇంకా సస్పెన్స్ గానే ఉంది. రామ్ చరణ్ 17 కోసం దర్శకుడు సుకుమార్ తన పేరుని పరిశీలిస్తున్నట్టు వచ్చిన వార్త పుకారేనని ఆ టీమ్ వర్గాలు చెబుతున్న మాట. స్క్రిప్ట్ లాకయ్యే దశలో హీరోయిన్ వేట జరుగుతుందని, అప్పటిదాక ఇవన్నీ ఊహాగానాలుగానే చూడాలని అంటున్నారు. ఇక సిటాడెల్ సీజన్ 2 ఉంటుందో లేదో అనేది అనుమానంగానే ఉంది. ఆర్థిక కారణాల వల్ల బ్రేక్ పడిన వెబ్ సిరీస్ రక్త్ బ్రహ్మాండ్ త్వరలోనే కొనసాగబోతోందట. సమంతాకి ఇది చాలా ముఖ్యం. సరికొత్త హారర్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చేలా తీర్చిదిద్దుతున్నారట.

# టీజర్ రిలీజ్‌కి రంగం సిద్ధం

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ఇప్పటికే ఫస్ట్ లుక్ స్ట్రాంగ్ ఇంపాక్ట్‌ని క్రియేట్ చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. తాజాగా ప్రీ-టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. రాబోయే ఇంటెన్స్ యాక్షన్, ఉత్కంఠను రుచి చూపించే అద్భుతమైన ప్రీ-టీజర్ విడుదలతో ఉత్సాహం న్యూ హైట్స్‌కి చేరుకుంది. ప్రీటీజర్‌లో కళ్యాణ్ రామ్ ఒక పడవపై కూర్చుని, సముద్రం వైపు చూస్తూ తన చూపులు కదలకుండా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన అతని చొక్కా, అతని చుట్టూ ఉన్న అల్లకల్లోలాన్ని సూచిస్తుంది, పడవలు దగ్గరకు వస్తున్నప్పుడు అతని ఫెరోషియస్ లుక్ జరగబోయే పెద్ద యుద్ధాన్ని చూస్తోంది. ప్రీ-టీజర్ జరగబోయే బ్లాస్ట్‌కి టోన్ సెట్ చేసింది. ఇది యాక్షన్ రోలర్ కోస్టర్‌ను అందిస్తుంది. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన నేపథ్య సంగీతం పవర్‌ఫుల్‌గా ఉంది. టీజర్‌ను ఈనెల 17న విడుదల చేయటానికి మేకర్స్ రంగం సిద్ధం చేశారు. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, యాక్షన్: రామకృష్ణ, పీటర్ హెయిన్.